ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY




రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

మంగళవారం 29 జూలై 2025

సాహిత్య మహారాజు.. సినారె



- హన్మాజిపేట నుంచి... జ్ఞానపీఠం వరకు
- విశ్వంభరుడి జ్ఞాపకాల్లో సాహిత్య కారులు
- నేడు మహాకవి సి. నారాయణరెడ్డి 94వ జయంతి

6

ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

- సమస్యలను సత్వరమే పరిష్కరించాలి
- కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝూ

8

నేడు కేంద్రీయ విద్యాలయం ప్రారంభం

- ఆన్‌లైన్ ద్వారా నూనత భవనాన్ని ప్రారంభించనున్న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

7

కడుపు 'కోత'లే



- 2024-25లో 7,183 ప్రసవాలు, 5,785 సిజేరియన్లే
- గత మూడు నెలల్లో 1501 ప్రసవాలు.. 1,188 ఆపరేషన్లు..
- ప్రైవేటు ఆసుపత్రుల్లో అడ్డగోలుగా శస్త్రచికిత్సలు...
- నామాత్రంగా అధికారుల పర్యవేక్షణ

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

రాజన్నసిరిసిల్ల జిల్లాలో సాధారణ ప్రస వాలు తగ్గిపోతున్నాయి. గర్భిణీలు ప్రసవానికి ఆసుపత్రులకు వెళ్తే కత్తితోనే కాన్పుఅన్నట్లుగా పరిస్థితి మారింది. ప్రభుత్వ, ప్రైవేటు అనే తేడా లేకుండా సాధారణ ప్రసవంకోసం ఎదురు చూడకుండా ఆపరేషన్ చేస్తు న్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సగంవరకు ఉండగా ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆపరేషన్ కాన్పు అన్నట్లుగా మార్చేశారు. ప్రైవేటు ఆసుప వెళ్లగానే బిడ్డ అడ్డం తిరుగుతుంది. ఇతర సమస్యలు వస్తాయి. వెంటనే ఆపరేషన్ అంటూ హడావుడి చేసి సిజేరియన్‌తోనే ప్రసవం చేస్తారనే విమర్శలు ఉన్నాయి. ప్రైవేటుడాక్టర్లు గర్భిణుల కుటుంబ సభ్యులు కాన్పుకు తొందర పడు తున్నారని చెప్తున్నారు. మరోవైపు ముహూర్తాల పేరిట కూడా కుటుంబ సభ్యులు డాక్టర్‌పై ఒత్తిడిచేసి ప్రస వాలు చేయిస్తున్న సందర్భాలు ఉన్నాయి. కొన్ని ఆసుపత్రుల్లో డాక్టర్లు ముహూర్తాలు చూసుకోండని చెప్తున్నారు.

జిల్లాలో 2025-26లో ప్రసవాలు

	ప్రభుత్వ ఆస్పత్రుల్లో...		ప్రైవేట్ ఆస్పత్రుల్లో	
మాసం	సాధారణం	సిజేరియన్లు	సాధారణం	సిజేరియన్లు
ఏప్రిల్	84	184	34	213
మే	74	187	31	243
జూన్	66	157	24	204
మొత్తం	224	528	89	660

జిల్లాలో ఇదీ పరిస్థితి

రాజన్న సిరిసిల్ల జిల్లాలో గతంలో తల్లి, బిడ్డ ఆరో గ్యమే లక్ష్యంగా ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం ఇచ్చేవారు. ప్రస్తుతం పూర్తిగా మారిపోయాయి. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెరిగినా ఆపరేషన్లు మాత్రం ఆగడం లేదు. ప్రైవేటు ఆస్పత్రుల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. జిల్లాలో 2024-25 సంవ త్సరంలో 7,183 ప్రసవాలు జరుగగా సాధారణ ప్రసవాలు 1,398 ఉన్నాయి. ఆపరేషన్ల ప్రసవాలు 5,785 చేశారు. ఇందులో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 3,575 ప్రసవాలు జరుగగా సాధారణ ప్రసవాలు 1,018 ఉన్నాయి. ఆపరేషన్ల ద్వారా 2,557 ప్రసవాలు చేశారు. ప్రైవేటు ఆస్ప త్రుల్లో 3,608 ప్రసవాలు జనరుగగా సాధారణం 380 ప్రసవాలు మాత్ర మే ఉన్నాయి. ఆపరేషన్ల ద్వారా 3,228 ప్రసవాలు చేశారు. 2025-26 సంవత్సరంలో గత మూడు నెలల్లో ఏప్రిల్ నుంచి జూన్‌వరకు 1,501 ప్రసవాలు జరిగాయి. సాధారణం 313 ఉండగా 1,188 ఆపరేషన్లు చేశారు. ఇందులో ప్రభుత్వ ఆసు పత్రుల్లో 752ప్రసవాలు జరగగా సాధారణ ప్రసవాలు 224ఉండగా, 528 ఆపరేషన్లు చేశారు. ప్రైవ్రేట్‌ఆస్పత్రుల్లో 749ప్రసవాలు జరుగగా సాధారణం 85మాత్రమే చేశారు. 660 ప్రసవాలు ఆపరేషన్ల ద్వారా చేశారు. జిల్లాలో అధికారుల పర్య వేక్షణ నామాత్రంగా ఉండడంతోనే ప్రైవ్రేట్ ఆస్ప త్రుల్లో నిర్వాహకులు అడ్డగోలుగా... - మిగతా 8లో

జిల్లాలో 2024-25లో ప్రసవాలు ఇలా..

	ప్రభుత్వ ఆస్పత్రుల్లో...		ప్రైవేట్ ఆస్పత్రుల్లో..	
మాసం	సాధారణం	సిజేరియన్లు	సాధారణం	సిజేరియన్లు
ఏప్రిల్	93	271	32	218
మే	90	229	32	236
జూన్	65	215	28	239
జూలై	82	200	26	225
ఆగస్టు	93	263	36	304
సెప్టెంబర్	101	223	30	295
అక్టోబర్	80	236	34	329
నవంబర్	99	197	43	315
డిసెంబర్	95	223	30	336
జనవరి	86	173	31	279
ఫిబ్రవరి	71	153	33	227
మార్చి	63	174	25	225
మొత్తం	1,018	2,557	380	3,228

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

- జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వై శ్రీనివాస్



మొక్కలు నాటుతున్న డీఐవో శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణాన్ని పరిరక్షించు కోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వై శ్రీనివాస్ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రాంగణంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యా ధికారి వై శ్రీనివాస్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డారు. ప్రతి ఒక్క విద్యార్థి ఒక్క మొక్క నాటి దానిని పరిరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ రోజు నాటిన మొక్కలే రేపు చెట్లుగా ఎదిగి మన ఆరోగ్యాలను పరిరక్షిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిప ల్ విజయరఘనందన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

163 సెక్షన్ విధించడం నిరంకుశ చర్య

- టీయూడబ్ల్యూజే - ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యుడు నగునూరి శేఖర్

సిరిసిల్ల జూలై 28 (ఆద్రజ్యోతి): జర్నలిస్టు కాయితబాలుపై భారతీయ నాగరిక్ సురక్ష సంహిత సెక్షన్ 163 విధించి నెలరోజులపాటు ఎలాంటి ప్రకటన చేయరాదంటూ, రాతపూర్వకమైన, వీడియో సందేశం గానీ ప్రచా రం చేయరాదంటూ సిరిసిల్ల తహసీల్దార్ నిషేధం విధించడం నిరం కుశ చర్య అని టీయుడబ్ల్యూజే-ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యుడు నగునూరి శేఖర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇది ఒక జర్న లిస్టు భావ ప్రకటన స్వేచ్ఛను కాలరాయడమే అన్నారు. భారత రాజ్యాంగం ఆర్టికల్ 19 ద్వారా పౌరులకు కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛ ను హరించడమే అవుతుందని అభిప్రాయపడుతున్నామని అన్నారు. 163 సెక్షన్‌ను తహసీ ల్దార్ వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతున్నామన్నారు.

ఖాళీ స్థలం.. దోమలకు ఆవాసం



ఖాళీ స్థలంలో నిల్వ ఉన్న మురుగు నీరు

ఎల్లారెడ్డిపేట, జూలై28(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పం చాయతీ పరిధిలోని గన్న బాల్‌రెడ్డి షెడ్డు సమీపంలో ఖాళీ స్థలం మురికి కూపంలా మారింది. కాలనీలోని ఇళ్ల నుంచి వచ్చే వృధా నీరు డ్రైనేజీ ద్వారా కిందకు వచ్చి చేరుతోంది. మురుగు నీరు వచ్చేందుకు సరైన కాల్వ లేక ఖాళీస్థలంలో నిల్వ అవుతోంది. దీంతో ఇక్కడ మురికికూపంలా మారి దోమలకు ఆవాసంగా మారింది. నిత్యం దుర్వాసన భరించలేకపోతున్నామ ని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమలవల్ల జ్వరాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధితశాఖ అధికారు లు స్పందించి చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

విద్యార్థులకు దుస్తులు, టై బెల్టుల పంపిణీ



దుస్తులు, టై బెల్టులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

సిరిసిల్లటౌన్ జూలై 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని గోపాల్‌నగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం పూర్వ విద్యార్థులు ఉచితం గా పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్, దుస్తులు(స్పోర్ట్స్ దుస్తులు), టై బెల్టులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాగ్య, పూర్వవిద్యార్థులు సబ్బని సురేష్, గడ్డమీది మాధవి, ఉపాధ్యా యులు మమత, సత్తు రవీందర్, మహేందర్, భవాని, రవళి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

- ట్రాక్టర్ ఇసుకుకు రూ. 15 వందలు చెల్లించాలి
- కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝూ

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా మంజూరైన ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచడంతో పాటు ట్రాక్టర్ ఇసుకకు రూ. 15 వందలు చెల్లించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమా ర్‌ఝూ కోరారు. సిరిసిల్ల సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వాటిపు రోగతిపై సంబంధిత అధికారులతో వీడి యో కాన్ఫ రెన్స్ నిర్వహించారు. జిల్లాలో మండలాల వారీగా మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లు, మార్కింగ్ చేసిన ఇళ్లు, నిర్మాణాలు జరుగుతున్న ఇళ్లు వాటి పురోగతి వివరాలను మండలాల వారీగా అధికారులను అడిగి



అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ సిరిసిల్ల జిల్లాలో ప్రభుత్వం 8వేల 811 ఇళ్లను మంజూరు చేయగా 5,011 ఇళ్లకు మార్కింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. 1,485 ఇళ్లు బేసిమెంట్ స్థాయికి, 122 ఇళ్లు గోడల దశవరకు, 50 ఇళ్లు రూఫ్ వరకు నిర్మా ణం జరిగాయన్నారు. శ్రావణ మాసంలో పెండింగ్ ఇళ్లకు మార్కింగ్ పనులు కూడా పూర్తిచేయా లన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక కొరత లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి వివరాలను ఎప్పటికప్పుడు పరిశీ లిస్తూ ఆన్‌లైన్ నమోదు చేయాలన్నారు. లబ్ధిదారుల కు ప్రభుత్వ తరపు నుంచి ఆర్థిక సహాయం సకా లంలో అందేలా అధికారులు చూడాలన్నారు. ఇందిర మ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఉచిత ఇసుకను అందిస్తుందని ఇసుక తీసుకెళ్లేందుకు కూలీ, రవాణా చార్జీలు మత్రమే లబ్ధిదారులు చెల్లించాల్సి ఉంటుం దని జిల్లాలో ఎక్కడైనా ట్రాక్టర్ ఇసుక రూ 15వందల కంటే ఎక్కువగా తీసు కుంటే అధికారుల దృష్టికి తీసు కరావాలన్నారు. హౌసింగ్ పీడీ శంకర్, మండల ప్రత్యే క అధికారులు, తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ నూతన భవనానికి స్థల పరిశీలన

గంభీరావుపేట, జులై 28 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రానికి సమీ పాన ఉన్న కాకుల గుట్ట ప్రాంతంలో వ్యవసాయ మార్కెట్ నూతన భవన నిర్మాణం కోసం సోమవారం స్థల పరిశీలన చేశారు. గత పాలక వర్గ సమయంలోనే భూమిని గుర్తించి, స్థలాన్ని మార్కెట్ కోసం నిర్ణయించారు. అదే స్థలాన్ని వ్యవసాయ మార్కెట్ నూతన భవనం కోసం స్థానిక తహసీల్దార్ మారుతిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, లింగా పూర్ మాజీ సర్పంచ్ పూజం భూమరాజం పరిశీలించారు. కాకపోతే ఈ స్థలం పూర్తిగా బండరాళ్ళ మధ్య, సరిగా దారి లేకుండా ఉందని ఈ విషయాన్ని జిల్లా అధికారు లకు దృష్టికి తీసుకెళుతామని పేర్కొన్నారు.

సమస్యలను చట్టపరంగా పరిష్కరిస్తాం

- ఎస్పీ మహేశ్ బి. గీతే

సిరిసిల్ల క్రైం, జూలై 28(ఆంధ్రజ్యోతి): సమస్యలను చట్టపరంగా పరిష్కరిస్తామని ఎస్పీ మహేశ్ బి. గీతే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో 25 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులు స్వీకరించి సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి గ్రీవెన్స్ డే ఉపయోగపడుతుందన్నారు. అర్జిదారుల నుంచి ఫిర్యాదులు స్వీక రించి ఆయా పోలీస్‌స్టేషన్‌ల ఎస్‌హెచ్‌ఓలకు ఫోన్‌చేసి బాధితుల సమస్య లను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించామన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి వినతులు, ఫిర్యాదులు స్వీకరించి అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడా లన్నారు. సాధ్యమైనంత త్వరగా సమస్యలు పరిష్కరించేలా చూస్తామన్నారు.

బీడీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ

సిరిసిల్ల రూరల్, జూలై 28 (అంధ్రజ్యోతి) : అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే బీడీ కార్మికులకు ప్రతి నెలా రూ. 4వేల జీవనభృతి అందిస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసి బీడీ కార్మికులను అదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని చేనేత వస్త్ర వ్యాపార సంఘ భవనంలో సీఐటీయూ బీడీ సిగార్ వర్కర్స్ యూనియన్ జిల్లా మూడవ మహాసభలలో రెండవ రోజు సోమవారం జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కార్యదర్శి రమణ మాట్లాడుతూ బీడీ కంపెనీల యాజమాన్యం బీడి కార్మికల శ్రమను విపరీతంగా దోపిడికి పాల్పడుతుందన్నారు. కార్మికులు పని చేసిన బీడీల నుంచి 2500 బీడీల కూలీని దోచుకోవడమే కాకుండా దీనితోపాటు అనేక రకాలుగా కోతల పేరుతో కార్మికుల వేతనాల నుంచి నెలకు దాదాపు రూ వెయ్యి వరకు కట్ చేయడం జరుగుతుందన్నారు. బీడి పరిశ్రమ, కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై బీడి కంపెనీల యాజమాన్యాలు



బీడీ కార్మికుల మహాసభలో మాట్లాడుతున్న కోడం రమణ

చేస్తున్న దోపిడిపై కార్మికులను ఐక్యం చేసి రాబోయే కాలంలో పోరాటాలు చేసేందుకు బీడి కార్మికులందరు ముందుకు రావాల న్నారు. కార్మికులందరూ కంపెనీ యాజమాలకు, టెకేదారులకు భయపడకుండా ఐక్యం కావాలన్నారు. వారికి సీఐటీయూ బీడి కార్మిక సంఘం అండగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మూషం రమేష్, శ్రీరాముల రమేష్‌చంద్ర, సూరం పద్మ, మాడుగుల మల్లయ్య, గట్లస్వప్న తదితరులు పాల్గొన్నారు.

బీడీ సిగార్‌వర్కర్స్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక



శ్రీరాముల రమేష్‌చంద్ర, అధ్యక్షుడు



సూరం పద్మ ప్రధాన కార్యదర్శి

సిరిసిల్ల రూరల్, జూలై 28 (అంధ్రజ్యోతి): సీఐటీయూ తెలం గాణ బీడీ సిగార్‌వర్కర్స్ యూని యన్ రాజన్న సిరిసిల్ల జిల్లా కమి టీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, జిల్లా ఉపాధ్యక్షుడు మూషం రమేష్‌లు ప్రకటించారు. సిరిసిల్ల పట్టణంలోని చేనేత వస్త్ర వ్యాపార సంఘ భవనం లో సోమవారం సీఐటీయూ తెలం గాణ బీడీ సిగార్ వర్కర్స్ యూని యన్ జిల్లా మూడవ మహాసభల ముగింపు సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా శ్రీరాముల రమేష్ చంద్ర, ప్రధాన కార్యదర్శిగా సూరం పద్మ , గౌరవ అధ్యక్షుడిగా మూషం రమేష్, కోశాధికారిగా జిందం కమలాకర్, ఉపాధ్యక్షులుగా దాసరి రూప, కావేటి సత్యం, లక్ష్మణ్, కార్యదర్శులుగా బెజుగం సురేష్, బోనాల లక్ష్మీ, కీసరి పుష్పల, కమిటి సభ్యులుగా మాడు గుల మల్లయ్య, గట్లస్వప్న, లింగంపల్లి జ్యోతి, గురజాల మమత, సులోచన, వాణి, మానసలను ఎన్నుకు న్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

యూరియా సరఫరాపై బీజేపీ రాజకీయం

- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): యూరియా సరఫరా విషయంలో బీజేపీ రాజకీయం చేస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీని వాస్ ఖండించారు. యూరియా సరఫరాపై రామచంద్రరావు మాట్లాడిన వాఖ్యలపై ఆది శ్రీనివాస్ స్పందించారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం తన నివాసంలో మాట్లాడారు. యూరియా సరఫరా విషయంలో బీజేపి కావా లని రాజకీయం చేస్తుందని అన్నారు. రైతులపై బీజేపీ వారు కపట ప్రేమ చూపిస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఖరీఫ్ సీజన్‌లో 9 లక్షల 80 వేల మెట్రిక్ టన్నులు కేటాయించి, 12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేశామని చెప్పడం అబద్దమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ నెల నుంచి జూలై వరకు రాష్ట్రానికి రూ. 6 లక్షల 60 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాల్సి ఉండగా కేవలం 4 లక్షల 23 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేసిందని వివరించారు. ఇప్పటికైనా రైతులను బీజేపీ తప్పుదోవ పట్టించడం మానుకోవాలని హి తవుపలికారు. యూరియా సరఫరా విషయంలో బీజేపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు అ వగాహన లేక మాట్లాడుతున్నార ని, యూరియా సరఫరా విషయం లో సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రులను కలిసి పలుమార్లు విజ్ఞప్తి చేసినా స్పందించలేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ నెలలో 1 లక్ష 70 వేల మెట్రిక్ టన్నులు కేటాయించి కేవలం 1 లక్ష 21 వేల మెట్రిక్ టన్నులను మాత్రమే సరఫరా చేసిందని వివరించారు. ఏప్రిల్ నెల నుంచి జూలై వరకు కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి 6 లక్షల 60 వేల మెట్రిక్ టన్నులు కేటాయించి కేవలం 4 లక్షల 23 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేసిందని తేటతెల్లం చేశారు. మన రాష్ట్రానికి రావాల్సిన యూరియా కంటే కేంద్రం తక్కువ సప్లై చేసిందన్నారు.



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

అప్పుల బాధతో ఉరి వేసుకొని ఒకరి బలవన్మరణం


చంద్రయ్య(ఫైల్)

గన్నేరువరం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన పబ్బతి చంద్రయ్య (40) అప్పులబాధతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాలప్రకారం.. చంద్రయ్య ఉపాధి నిమిత్తం 5నెలల క్రితం సౌదీదేశానికి వెళ్లి ఇటీవలే స్వగ్రామానికి వచ్చాడు. అప్పటికే విదేశాలకు వెళ్లేందుకుచేసిన అప్పుతో పాటు తిరిగి వచ్చాక మరిన్ని అప్పులు చేశాడు. దీంతో సుమారు 4లక్షల వరకు అప్పు ఉండ డంతో అవితీర్చాలో తెలియక మనస్తాపం చెందాడు. దీంతో సోమవారం మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో ఇంటి ముందున్న జామచెట్టుకు ఉరివేసు కుని మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడు చంద్రయ్య భార్య పబ్బతి ప్రమీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అమెరికాలో సింగరేణి ఉద్యోగి మృతి


ప్రకాష్(ఫైల్)

గోదావరిఖని, జూలై 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక పవర్‌హౌస్‌కాలనీకి చెందిన పెరుక ప్రకాష్(53) అమెరికాలో శనివారం గుండె పోటుకు గురై చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఓసీపీ-2లో జనరల్ మజ్దూర్‌గా పని చేస్తున్న ప్రకాష్ రెండు నెలల క్రితం అమెరికా టెక్సాస్ స్టేట్ ఆస్టిన్‌లో కూతురు వద్దకు వెళ్లాడు. మరికొద్దిరోజుల్లో ఇండియాకు తిరిగివచ్చే సమయంలోనే శనివారంఉదయం ఆయన గుండెపోటుకు గురయ్యాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రకాష్ ఆదివారం మృతిచెందాడు. అతడి పార్థివదేహాన్ని గోదావరిఖనికి తీసుకువచ్చేందుకు బంధుమిత్రులు ప్రయత్నాలు చేస్తున్నారు.

నీటి బకెట్‌లో పడి బాలిక దుర్మరణం


మృతిచెందిన బాలిక

జూలపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన గుండు సతీష్ కూతురు సాన్వీ (19నెలలు) చిన్నారి ఇంటి ఆవరణలో ఉన్న బకెట్‌లో పడి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. గ్రామస్థులు పోలీసులు అందించిన సమాచారం మేరకు గుండు సతీష్, రవళి దంపతుల కూతురు సాన్వీ ఆదివారం రాత్రి ఇంటి ఆవరణలోఉన్న నీటి బకెట్‌లో ప్రమాదవశాత్తు పడి కొట్టుమిట్టాడుతుండగా గమనించిన తల్లి దండ్రులు, కుటుంబ సభ్యులు వైద్యంకోసం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రతిమ ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తుండగానే మృతిచెందినట్లు తెలిపారు. చిన్నారి మృతిపై తమకు ఎవరిపై అనుమానం లేదని తండ్రి పోలీసులకు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సనత్‌కుమార్ తెలిపారు.

చిరుత దాడిలో లేగ దూడ మృతి

కోనరావుపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం ఎగ్లాస్‌పూర్ గ్రామంలో చిరుత దాడిలో లేగ దూడ మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి వెలుగులోకి వచ్చింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వేముల మధు అనే రైతు తన పశువులను గ్రామ శివారులోని తన పొలం వద్ద కట్టేసి ఇంటికి వచ్చాడు. అదే రాత్రి చిరుత దాడిచేసి చంపివేసింది. ఈవిషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. చిరుత దాడిలోనే దూడ మృతి చెందినట్లు గుర్తించారు. చిరుత సంచారంతో పొలాల వద్దకు వెళ్లేందుకు అటవీప్రాంత రైతులు భయాందోళనకు గురవుతున్నారు.

జిలెటిన్ స్టిక్స్ స్వాధీనం

ఎల్లారెడ్డిపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామశివారులో అనుమతి లేకుండా పేలుళ్లకు పాల్పడుతున్న వ్యక్తులపై సోమవారం దాడి చేశామని పోలీసులు తెలిపారు. కంప్రెసర్ వాహనంతోపాటు జిలెటిన్ స్టిక్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని వివరించారు.

సాహిత్య మహారాజు సినారె



సిరిసిల్లలోని సినారె స్మారక గ్రంథాలయం

- హన్మాజిపేట నుంచి..జ్ఞానపీఠం వరకు
- అక్షరానికి మాటల...పాటల చెలికాడు
- విశ్వంభరుడి జ్ఞాపకాల్లో సాహిత్య కారులు
- నేడు మహాకవి సి నారాయణరెడ్డి జయంతి

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

పాట.. మాట నా రెండు కళ్లు అన్నాడు.. మహాకవి డాక్టర్ సి. నారాయణరెడ్డి. మాటకు దండం పెడతా... పాటకూ దండంపెడతా... మాటను పాటను నమ్మిన మనిషికీ దండం పెడతా అంటూ సినారె అడుగులువేసిన మానేరు ఇసుక తిన్నెలు... మూలవాగు సవ్వడులు నేటికీ వినిపిస్తూనే ఉన్నాయి. జూలై 29 మహాకవి డాక్టర్ సి నారాయణరెడ్డి 94వ జయంతి సందర్భంగా ఆయన జ్ఞాపకాల మదిలోకి వెళ్తే...

సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం హన్మాజీపేట గ్రామంలో జులై 29, 1931లో సినారె ఊపిరి పోసుకున్నారు. తల్లిదండ్రులకు ఒక్కగానొక్క కొడుకు సినారె. కుటుంబ పరంగా భూస్వామ్య వారసత్వమైన ఆ మనస్తత్వం ఇంట్లో ఎవరికీ లేదు. తండ్రి స్వయంగా తానే నాగలి పట్టి దున్నేవాడు. సినారె మూడో తరగతి వరకు ఊళ్లోనే చదువుకున్నా నాలుగో తరగతికి సిరిసిల్ల మానేరు ఒడ్డుకు చేరుకున్నారు. పొరుగూరికి పంపించి చదివించడం తల్లి బుచ్చమ్మకు ఇష్టం లేకపోయినా తండ్రి మల్లారెడ్డి ప్రోత్సాహంతో ఉన్నత చదువులు చదివారు.



'ఊపిరాడలేదు... ఉక్కపోస్తుంది. ఏసీ గదిలో... కారణం తెలిసి పోయింది. కవిత రాయలేదు ఇవాలా... రాస్తూ రాస్తూ పోతాను... సిర ఇంకిపోయే వరకు అంటూ సినారె తనకు 86 ఏళ్ల పూర్తవుతున్న సమయంలో 2017 జూన్ 12న కన్నుమూశారు.

సినారె సిరిసిల్ల మానేరు తీరాన ప్రాథమిక విద్యను కరీంనగర్‌లో ఉన్నత పాఠశాల విద్యను అభ్యసించి పైచదువులకు హైదరాబాద్‌కు చేరుకున్నారు. హైదారాబాద్‌లోని చాదర్‌ఘాట్ కళాశాలలో ఇంటర్మీడియేట్, ఉస్మానియాలో బీఏ ఉర్దూ మీడియంలోనే పూర్తి చేశారు. ఉస్మానియా విశ్వవిద్యా లయం నుంచే తెలుగు సాహిత్యంలో పోస్టు గ్రాడ్యుయేట్, డాక్టరేట్ పొందారు. శ్రీ కృష్ణదేవరాయ ఆంధ్ర భాషానిలయంలో అనేక గ్రంథాలను చదివారు.

తొలి రచన సిరిసిల్లలో ఆవిష్కరణ

బాల్యంనుంచే పద్యాలు, పాటలు, కవిత్వాన్ని రాసే సి. నారాయణరెడ్డి కళాశాల విద్యార్థిగానే శోభ పత్రికకు సంపాదకత్వం వహించారు. రోచిస్, సింహేంద్ర పేరుతో కవితలను రాసేవారు. సినారె కవిత తొలిసారిగా జనశక్తి పత్రికలో అచ్చయ్యింది. 1953లో నవ్వని పువ్వు సంగీత నృత్యనాటికను ప్రచురించారు. ఆది సిరిసిల్ల టౌన్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. అక్కడి నుంచి ఎన్నో కవితా సంపుటాలను వెలువరించారు.

ఎన్నెన్నో పురస్కారాలు

సినారె అందుకున్న అవార్డులు ఎన్నో ఉన్నాయి. 1974లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, రాజ్యలక్ష్మి అవార్డు, సోవియట్ ల్యాండ్ అవార్డు, మోహినిదాస్, కోమారన్, 1988లో అత్యున్నత జ్ఞానపీ ఠ అవార్డు అందుకున్నారు. పద్మశ్రీ, పద్మభూషణ్ పుర స్కారం, ఉత్తమ పాటల రచయితగా నంది పురస్కారం, గౌరవ డాక్టరేట్లను పొందారు. 95కిపైగా పుస్తకాలు రాయగా, సినిమాలకు 3,500లకుపైగా పాటలు రాశారు. హిందీ, ఉర్దూ భాషాల్లో కూడా కవితలు రాశారు.

అజేయుడు సినారె : జూకంటి జగన్నాథం,అధ్యక్షుడు, తెలంగాణ అఖిల భారత రచయితల సంఘం



సినారె అజేయుడు, చిరంజీవి. తెలుగు కవిత్వం ఉన్నంత వరకు సినారె అనే మూడు అక్షరాలు శిలాక్షరాలుగా నిలుస్తాయి. మారుమూల హనుమాజీపేట గ్రామంలో రైతు బిడ్డగా పుట్టిన సి నారా యణరెడ్డి దేశంలోని అత్యున్నత పురస్కారాలన్నీ పొందారు. సినిమా పాటలు రాసిన, యూనివర్సిటీలో పాఠాలు బోధించినా , రాజ్యసభలో తెలుగు భాషపై గలమెత్తిన నిండు నిఖార్సయిన తెలుగు రైతు కవిగా ప్రశ్నించేవారు.

తెలుగు సాహిత్యంలో ఒక ప్రవాహం వారాల ఆనంద్, కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత



సినారె కవిత్వం తెలుగు సాహిత్యంలో ఒక ప్రవాహం. ఆయన కవిత్వం ప్రేమను, మానవతను, తాత్వికతను అక్షరాలలో నింపి ఒకవైపు సంగీతమయంగానూ, మరోవైపు లయాత్మకంగానూ ఉంటుం ది. తను విశ్వంభర వంటి దీర్ఘ కవితల్లో ప్రపంచాన్ని మానవ జీవితాన్ని తాత్వికంగా స్పృశించిన తత్వవేత్తగా కనిపిస్తారు. సినిమా పాటల్లో సులభతరమైన, అందరికీ చేరగలిగే భావాన్ని ఆయన పొందుపరిచారు.

పశువుల కాపరి పైకి దూసుకెళ్లిన కారు

- తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులోని కామారెడ్డి- సిరిసిల్ల ప్రధానరహదారిపై కారు సోమవారం అదుపుతప్పి పశువుల కాపరిపైకి దూసుకెళ్లింది. ఈ సంఘటనలో మండలంలోని రాగట్లపల్లికి చెందిన కాపరి నవీన్ తీవ్ర గాయాల పాలయ్యాడు. క్షతగాత్రుడిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. నవీన్ తన పశువులను రోడ్డు పక్కన మేపుతున్నాడు. సిరిసిల్ల నుంచి ఎల్లారెడ్డిపేట వైపుకు వెళుతున్న కారు అదుపుతప్పి నవీన్‌పైకి దూసుకెళ్లింది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

రూ.7600 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తిధర రూ.7600 పలికింది. సోమవారం మార్కెట్‌యార్డుకు ముగ్గురు రైతులు 15క్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వార గరిష్ఠ ధర రూ.7600 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

గంజాయి పట్టివేత

వెల్గటూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలం ముక్కట్రావుపేట శివారులో వాహనాలు తనిఖీచేస్తుండగా ఓ యువకుడి వద్ద 110గ్రాముల గంజాయి దొరికినట్లు ఎస్సై ఆర్ ఉమాసాగర్ తెలిపారు. గంజాయితో పట్టుబడ్డ ఓ యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ముక్కట్రావుపేట శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ యువకుడు అనుమానస్పదంగా కనిపించడంతో తనిఖీ చేయగా గంజాయి దొరికినట్లు పేర్కొన్నారు. ఆ యువకుడిపై కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలు

- చీమలకుంటపల్లి, లలితాపూర్‌లలో దొంగల బీభత్సం
- బంగారం, వెండిని ఎత్తుకెళ్లిన దొంగలు

గన్నేరువరం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీమలకుంటపల్లి గ్రామంలో దొంగలు తాళంవేసిన ఓ ఇంటిలో చొరబడి బీభత్సం సృష్టించారు. గ్రామానికి చెందిన ఎండీ రహీం భార్య అమీనాబేగం తన ఇంటికి తాళం వేసి రెండురోజుల క్రితం బంధువుల ఇంటికి వెళ్లింది. ఈక్రమంలో దొంగలు ఇంటితాళం పగులగొట్టి 25తులాల వెండి, తులం బంగారం ఎత్తుకెళ్లి పోయారు. సోమవారం అమీనాబేగం తిరిగి ఇంటికి వచ్చేసరికి ఇంటితాళాలు, బీరువా పగులగొట్టి ఉండడంతో దొంగతనం జరిగిందని గ్రహించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై నరేందర్‌రెడ్డి సిబ్బందితో చేరుకొని దొంగతనం జరిగిన తీరును పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. తాళంవేసిన ఇళ్లల్లోచోరీలు జరుగుతుండడంతో గ్రామస్థులు భయభ్రాంతులకు గురవుతున్నారు. పోలీసులు ప్రత్యేకనిఘా ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

లలితాపూర్‌లో ..

మానకొండూర్: మండలంలోని లలితాపూర్ గ్రామంలో పొలవేణి రాజయ్య ఇంటిలో గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన రాజయ్య, అతని భార్య సుగుణ దంపతులు ఆదివారం ఇంటికి తాళంవేసి ఐనవోలు గ్రామంలో ఉండే వారి కూతురు ఇంటిలో పోచమ్మ పండుగకు వెళ్లారు. ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వారి ఇంటితాళాలు పగుల బీరువాలోని తులంన్నర బంగారు నగలు, 10తులాల వెండిని ఎత్తుకెళ్లారు. సోమవారం గ్రామానికి వచ్చిన దంపతులు ఇంటితలుపులు పగులకొట్టి ఉండడాన్ని గమనించారు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని బంగారు నగలు లేకపోవడంతో లబోదిబోమంటూ విలపించారు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకొని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంజీవ్ తెలిపారు.


చీమలకుంటపల్లిలో దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్సై నరేందర్ రెడి

ఏడుగురిపై కేసు నమోదు

మెట్‌పల్లిటౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఎవరికీ తెలియకుండా మెట్‌పల్లి క్లబ్ ఆస్తులను, భూములను విక్రయించారనే ఫిర్యాదు మేరకు ఏడుగురు వ్యక్తులపై కేసునమోదు చేసినట్లు మెట్‌పల్లి ఎస్ఐ కిరణ్‌కుమార్ సోమవారం తెలిపారు. మెట్‌పల్లి పట్టణంలోని రామ్‌నగర్‌లో ఉన్న క్లబ్‌ను అక్రమంగా విక్రయించారని పట్టణానికి చెందిన దొంతుల వెంకటేశ్వర్‌రావు ఆదివారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు చెట్లపల్లి నరేంధర్‌గౌడ్, గంగుల వివేక్, వేముల కిషన్, దొంతుల సుధాకర్, వేము గంటి భూమేశ్వర్, నీల రాజు, వేముల అశోక్‌పై కేసు నమోదు చేసి దర్యాఫు జరుపుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

జాతీయ మానవ హక్కుల కమిషన్ బహిరంగ విచారణ

- ఒకే రోజు రెండు డివిజన్ బెంచీలపై 100కు పైగా కేసులు స్వీకరణ

హైదరాబాద్ సిటీ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): భూకబ్జాలు, ఆస్తి తగాదాలు, లైంగిక దాడులు తదితర మానవహక్కుల హననానికి సంబంధించిన వందకుపైగా కేసులపై జాతీయ మానవహక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) హైదరాబాద్‌లో సోమవారం బహిరంగ విచారణ నిర్వహించింది. డివిజన్ బెంచ్-1లో ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్మన్ జస్టిస్ రామ సుబ్రహ్మణ్యన్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్-1లో 36 కేసులు విచారించారు. కమిషన్ సభ్యులు సాయని విజయభారతి, జస్టిస్ బిద్యుత్‌రంజన్ సారంగి నేతృత్వంలోని డివిజన్ బెంచ్-2లో మొత్తం 52కేసులు విచారణకు వచ్చినట్లు సమాచారం. ఫుల్ బెంచ్ ఆధ్వర్యంలోనూ జైళ్లలోనిపరిస్థితులు, బాధితులకు తగిన సమయంలో పరిహారం అందకపోవడం, కొన్నికేసుల్లో పోలీసుల నిర్లక్ష్యం తదితర ఫిర్యాదులమీద సాయంత్రం వరకు విచారణ కొనసాగింది.

పాడి పరిశ్రమతో అదనపు ఆదాయం

- ఈ ఏడాది రూ.15కోట్ల బోనస్‌ను అందజేస్తాం
- ముల్కనూర్ సహకార బ్యాంకు అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి


మాట్లాడుతున్న బ్యాంకు అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి

భీమదేవరపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమతో మహిళలు అదనపు ఆదాయం పొందాలని ముల్కనూర్ సహకార బ్యాంకు అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. సోమవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ మహిళా డెయిరీలో 23వ వార్షిక మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన బ్యాంకు అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ ఈ సంవత్సరం వచ్చిన లాభాల్లో రూ.15కోట్ల బోనస్ మహిళా రైతులకు సద్దుల బతుకమ్మ సందర్భంగా అందజేస్తామన్నారు. ప్రస్తుత రోజుల్లో వ్యవసాయం ఇబ్బందిగా మారిందన్నారు. దీంతో మహిళలు పాడి పరిశ్రమ వైపు దృష్టిసారించి అదనపు ఆదాయం పొందాలన్నారు.

అనంతరం ముల్కనూర్ డెయిరీ జీఎం మార్పాటి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిరోజు డెయిరీకి 48వేల లీటర్ల ఆవు పాలు, 20వేల లీటర్ల గేదె పాలు వస్తున్నాయన్నారు. ఈ సంవత్సరం సభ్యులకు రూ.1.05కోట్లు సంక్షేమ పథకాలకు నిధులు పెంపు చేశామన్నారు. అంతకుముందు వార్షిక నివేదికను ఆడిట్ మేనేజర్ అజయ్ సభ ముందు ఉంచారు. కార్యక్రమంలో డైరెక్టర్లు జంపాల రాజేశ్వరి, నల్లాల సులోచన, పింగిలి రజిత, దొంతరవేణ రజిత, మామిడాల శోభారాణి, కర్ర రమాదేవి, కత్తుల కవిత, పెద్దవేణ అరుణ, గుండేల్లి రజిత, పొన్నం సుజాత, గుగ్లోతు సుజాతలతో పాటు వివిధ గ్రామాలకు చెందిన అధ్యక్షులు పాల్గొన్నారు.

మూడు వాహనాలను ఢీకొట్టిన కారు

సిరిసిల్ల క్రైం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని లహరి గ్రాండ్ వద్ద ఆదివారం అర్థరాత్రి ఓ కారు అదుపుతప్పి మూడువాహనాలకు ఢీకొట్టింది. ఈ సంఘటనలో వాహనాలలో ఎవరూ లేకపో వడంతో ప్రమాదం తప్పింది. హైదరాబాద్ నుంచి సిరిసిల్లకు వైపునకు వస్తున్న కారు అతివేగంగా వెళ్తూ పార్కింగ్‌లో ఉన్న రెండు కార్లకు ఢీకొని ఎదురుగా ఉన్న ఓ ప్రైవేటు బస్సుకు ఢీకొంది. ఈ సంఘటనలో కారు నడుపుతున్న డ్రైవర్‌కు గాయాలు కాగా కారు నుజ్జునుజ్జయింది.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కరీంనగర్ క్రైం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌రూరల్ మండలం నగునూర్ శివారు వాగునుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పట్టుకున్నట్లు రూరల్‌సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. ట్రాక్టర్‌డ్రైవర్ బి.మహేష్‌పై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

పండ్ల తోటల్లో లౌడ్ స్పీకర్లు

- పక్షుల బెడదకు రైతుల పాట్లు
- చిన్న ఆలోచనతో చక్కని పరిష్కారం
- ఒక్కసారి చార్జింగ్ చేస్తే ఏడు గంటల వరకు శబ్దాలు


తాను ఏర్పాటు చేసిన లౌడ్ స్పీకరుతో రైతు రవీందర్‌రావు

గంగాధర, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పంటలను పక్షులు, జంతువుల బారి కాపాడుకునేందుకు ఓ రైతు వినూత్నంగా ఆలోచన చేశాడు. గంగాధర మండలం కొండన్నపల్లి శివారులో కరీంనగర్‌కు చెందిన రైతు రవీందర్‌రావు 5ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇక్కడసాగుకు నీరు తక్కువగా ఉండడంతో ఆయన 13రకాల పండ్లచెట్లను నాటాడు. ప్రస్తుతం ఆయనకు జామపళ్ల రోజుకు రెండు క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. పక్షులు, జంతువులు పండ్లను తింటూ తీవ్రనష్టం చేస్తున్నాయి. కూలీలను పెట్టి పక్షులను తరిమేయాల్సి వస్తుండగా అదనపు భారం పడుతోంది. దీంతో ఆయన పక్షుల బెడద నివారణకు మైక్‌ను ఏర్పాటు చేశాడు. దానిలో పక్షులు, జంతువులు భయపడేలా వివిధ రకాల సౌండ్స్ రికార్డు చేయించాడు. తోట చుట్టూ మూడు మైక్‌లను పెట్టి సౌండ్ చేయిస్తున్నాడు. దీంతో ఆసౌండ్ విన్న పక్షులు భయంతో చెట్ల పైనుంచి ఎగిరిపోతున్నాయి. గంగాధర బ్లాక్‌లోని స్వామి అనే రైతు తనకున్న మామిడి తోటను కోతులు, పక్షుల నుంచి కాపాడుకోవడానికి ఏడు మైకులను ఏర్పాటు చేశాడు. గంగాధర, కొండన్నపల్లిలో రైతులు ఉపయోగిస్తున్న సౌండ్‌తో పక్షులు, కోతులు, ముంగీసలు, పిల్లులు పారిపోతుండగా మండలంలోని పలుగ్రామాల రైతులు పంట పొలాల్లో ఏర్పాటు చేసుకునేందుకు ఆలోచన చేస్తున్నారు.

పేకాటరాయుళ్లపై కేసు

ఎల్లారెడ్డిపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామశివారులోని గుడిసెలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో దాడిచేశామని ఎస్ఐ మోతీరాం సోమవారం తెలిపారు. పేకాట ఆడుతున్న 8మంది వద్ద నుంచి 8 సెల్‌ఫోన్లు, 6ద్విచక్రవాహనాలు, పేకాట ముక్కలు, రూ.4630 నగదును స్వాధీన పర్చుకున్నామని పేర్కొన్నారు. పేకాటరాయుళ్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

శ్రీరాములపల్లెలో..

గొల్లపల్లి: మండలంలోని శ్రీరాములపల్లె గ్రామంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడులు చేసి ఆరుగురు పేకాటరాయుళ్లను సోమవారం అరెస్ట్ చేశారు. ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి కథనం ప్రకారం పక్కా సమాచారం మేరకు గ్రామ శివారులో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించగా ఆరుగురు వ్యక్తులు పేకాట ఆడుతూ పట్టుబడ్డారు. వారి వద్ద రూ.7,380 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు వేదికగా కరీంనగర్

- జిల్లా ఒలింపిక్ సంఘు ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఉమ్మడిజిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి జనార్దన్ రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో రాష్ట్రస్థాయి క్రీడలకు కరీంనగర్ వేదికగా నిలుస్తోందని ఉమ్మడిజిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని వాగ్దేవిడిగ్రీ, పీజీకళాశాలలో 3వ తెలంగాణ రాష్ట్రస్థాయి కుంగ్‌ఫూకరాటే పోటీల బ్రోచర్‌ను కళాశాల చైర్మన్ గోవిందవరం కృష్ణ, పాఠశాల డైరెక్టర్ గోపు సుశాంక్ రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి కుంగ్‌ఫూ పోటీలను సెప్టెంబరులో కరీంనగర్ జిల్లాకేంద్రంలో నిర్వహించనుండడం అభినందనీయమన్నారు. పోటీలనిర్వాహకుడు ఎలగందుల శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి హాజరయ్యే క్రీడాకారులకు ఉచితభోజన, వసతి సౌకర్యాలు కల్పించనున్నామన్నారు. ఆల్‌స్టైల్ కుంగ్‌ఫూ యూనిట్ ఆఫ్ తెలంగాణ అధ్యక్ష, కార్యదర్శులు నేరెళ్ల శ్రీధర్‌గౌడ్, బొడ్డు రాజమల్లు, ఉపాధ్యక్షుడు రాజేందర్, సంయుక్త కార్యదర్శి కుర్ర శ్రీనివాస్, మాస్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా పోటీల్లో సత్తాచాటిన క్రీడాకారులు

సిరిసిల్ల టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ఖేలో ఇండియా రాష్ట్ర స్థాయి పోటీలలో సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన క్రీడాకారులు వివిధ విభాగాలలో సత్తాచాటారు. హైదరాబాద్ ఎల్బీస్టేడియం బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియంలో ఖేల్ ఇండియా సిటి ఉమెన్స్ లీగ్ రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలో రాజన్న సిరిసిల్ల జిల్లా స్పోర్ట్స్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ నుండి ఎనిమిది మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఫైట్ విభాగం లైట్ కాంటాక్ట్ జూనియర్ విభాగంలో గంగనవేణి ప్రవళిక, చిల్డ్రన్స్ పాయింట్ ఫైట్ విభాగంలో ఎల్లె ప్రణవి, గజ్జెల హిరణ్మయి, కెడేట్ పాయింట్ ఫైట్ విభాగంలో గజ్జెల శ్వేదిక, కర్నె యుతిక బంగారు పతకాలను సాధించారు. కిక్ బాక్సింగ్‌లో లక్ష్మీ ప్రసన్న, ప్రణవి, హిరణ్మయి, శ్వేదిక రజిత పతకాలను సాధించారు. కంచర్ల శ్రీనిక లింగం శ్లోక, లక్ష్మిప్రసన్నలు కాంస్య పతకాలను సాధించారు. పతకాలను సాధించిన క్రీడాకారులను తెలంగాణ కిక్ బాక్సింగ్ అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి మహిపాల్ పతకాలు, ప్రశంసా పతకాలను అందించి అభినందించారు.

జిల్లా స్పోర్ట్స్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వొడ్నాల శ్రీనివాస్, కోచ్ యెనగందుల శ్రీనివాస్ మాట్లాడుతూ బంగారు పతకాలు సాధించిన చిన్నారులు కిక్ బాక్సింగ్ సౌత్ ఇండియా పోటీలకు ఎంపికైన్నట్లు తెలిపారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగిన ఖేలో ఇండియా సిటి వుషూ ఉమెన్స్ లీగ్ రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లాకు చెందిన కందుకూరి లహరి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. వుషూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు స్వర్గం రవితేజ, కార్యదర్శి బిళ్ళ అఖిలభవాని, కోచ్ జావిద్‌ఖాన్ లహరిని అభినందించారు.


పతకాలను సాధించిన చిన్నారులతో అసోసియేషన్ రాష్ట్ర నాయకులు



పాండవ లంకలో జలపాతం

జలపాతాలకు సందర్శకుల తాకిడి

- పచ్చదనం అల్లుకున్న గట్టు సింగారం
- అహ్లాదకరంగా పాండవ లొంక జలపాతం
- కనువిందు చేస్తున్న గాడుదులగండి గుట్ట

పెద్దపల్లి రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సబ్బితం జలపాతానికి సందర్శకుల తాకిడి పెరిగింది. పూర్వకాలంలో ఏర్పడిన ఈ జలపాతం కొన్నేళ్ల వరకు గ్రామస్థులకు మాత్రమే తెలిసేది. 8 ఏళ్లుగా జలపాతం వద్దకు సందర్శకుల తాకిడి పెరిగింది. గట్టుసింగారం గుట్టపై సీతమ్మలోరి లొద్ది అనే ప్రాంతానికి శ్రీరాముడు వనవాసంలో భాగంగా వచ్చినట్లు పూర్వీకులు చెబుతున్నారు. ఆ సమయంలో జలపాతం వద్ద నీటిని సేవించాడని పేర్కొంటున్నారు. గట్టుసింగారం గుట్టపైన మామిడికుంట, మిడి చెరువు, చొక్కన్న కుంటలు ఉన్నాయి. వర్షాలతో నిండి బండరాళ్ల ద్వారా జలధారగా వస్తోంది. ఆ జలధారనే గౌరిగుండాల జలపాతంగా మారినట్లు ప్రచారంలో సాగుతోంది. పురాతన కాలంలో గుండం వద్ద గౌరీ మాత అనే దేవత కొలుపై స్నానాలు ఆచరించడంతో గౌరి గుండాల జలపాతంగా పేరు వచ్చిందని పూర్వీకులు తెలుపుతున్నారు.



సబ్బితం జలపాతం

పెద్దపల్లి జిల్లా కేంద్రం నుంచి మంథని వెళ్ళే దారిలో సబ్బితం వరకు 10 కి.మీ. దూరం ఉంది. అక్కడి నుంచి 3 కి.మీ. దూరంలో జలపాతం ఉంటుంది. జలపాతం సమీపం వరకు ద్విచక్ర వాహనాలు వెళ్తాయి. సబ్బితం నుంచి గౌరి గుండాల జలపాతం వద్దకు చేరుకోవాలంటే సుమారు 3 కి.మీ. మట్టి రోడ్డు ఉంటుంది. వర్షాలు కురిస్తే రోడ్డంతా బురద మయంగా ఇబ్బందికరంగా ఉంటుంది. జలధార వానాకాలంలో మాత్రమే ఉండటంతో ప్రజలు అధిక సంఖ్యలో వస్తారు. జలపాతానికి కిలోమీటర్ దూరం నుంచే వాహనాలు నిలిపి కాలినడకగా వెళ్లాల్సిన ఉంటుంది.

జలపాతం వద్ద పురాతన విగ్రహాలు

జలపాతం వద్ద రాయిని తొలచి చిన్న గుడి ఉంది. ఇందులో శివ లింగం ఉంటుంది. దాని పక్కనే ఓ బండరాయిపై నాగదేవత, ఇతర రూపాలు చెక్కి ఉన్నాయి. విగ్రహంలో శివలింగం, గణపతి, గోళ్లభామలు, గుట్టపై బయ్యన్న విగ్రహాలున్నాయి. గట్టుసింగారం, సబ్బితం గ్రామ ప్రజలు శ్రావణ మాసం లో జలపాతం వద్దకు వెళ్లి పూజలు నిర్వహిస్తారు.

జలపాతం వద్ద పోలీస్ పికెట్

జలపాతం వద్ద పెద్దపల్లి రూరల్ పోలీసులు పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు. జలపాతానికి వచ్చేందుకు ఎవరికి అనుమతి లేదని భారీ గేడ్‌లు ఏర్పాటు చేశారు. అక్కడ జరిగిన సంఘటనలు, జలపాతం వద్ద మృతిచెందిన వారి ఫొటోలతో ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతం వద్ద పలువురు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని స్థానికులు తెలిపారు. ముఖ్యంగా యువకులు మద్యం సేవిస్తూ పర్యాటకులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు.

జలపాతానికి రూ. 6 కోట్లు నిధులు కేటాయింపు

సబ్బితం జలపాతం అభివృద్ధికి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు చొరవతో రూ. 6 కోట్ల నిధులు విడుదల చేశారు. జలపాతం వెళ్ళేందుకు రోడ్లు, జలపాతం వద్ద సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నారు.

ప్రకృతి అందాల మధ్య పాండవ లొంక జలపాతం

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని జాఫర్‌ఖాన్ పేట శివారులో కొండపై ఉన్న పాండవ లొంక జలపాతం వద్ద సందర్శకుల తాకిడి పెరిగింది. రామగిరి కొండలపై పడ్డ వర్షపు నీరు ప్రవహించి పాండవలొంక నుంచి కిందికి జలపాతంగా వస్తున్నది. ఈ పాండవ లొంక ప్రాంతం వరకు సరైన దారి, సౌకర్యం లేకపోవడంతో జాఫర్‌ఖాన్‌పేట హనుమాన్ ఆలయం నుంచి సుమారు రెండు కిలోమీటర్ల మేర ఈ పాండవ లొంక ప్రాంతం ఉంటుంది. ఎత్తైన బండరాళ్లు ఉండటంతో ఈ ప్రాంతానికి నడిచి వెళ్ళాలి. వెన్నంపల్లి, జాఫర్‌ఖాన్‌పేట నుంచి ఈప్రాంతానికి రావడానికి వీలున్నా సరైన రహదారి లేక పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. పాండవ లొంక జలపాతాన్ని సందర్శించి, అక్కడ జలపాతంలో సేద తీరుతూ ప్రకృతిని ఆస్వాదిస్తుంటారు. దీనిని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని పర్యాటకులు కోరుతున్నారు. ఈ ప్రాంతం అడవులతో నిండి పచ్చని చెట్లతో పాండవులబొమ్మలు, అంజనేయస్వామి విగ్రహం, తదితర దేవతా మూర్తులు ఉన్నాయి. శ్రావణమాసంలో తీర్థాలకు, సహపంక్తి భోజనాలకు గ్రామస్థులు ఇక్కడికి వస్తారు. రామగిరి, ఓదెల, ముత్తారం తదితర మండలాలకు దగ్గరగా ఉన్న ప్రాంతం కావడంతో అధిక సంఖ్యలో ప్రజలు ఈ జలపాత సందర్శనకు వస్తారు.

గాడుదులగండి గుట్ట జలపాతం వద్ద సందడి

మంథనిరూరల్: మంథని మండలంలోని ఎక్లాస్‌పూర్ సమీపంలోని గాడుదులగండి గుట్ట జలపాతం వద్ద సోమవారం యువత సందడి చేసింది. వారం రోజులుగా కురుసిన వర్షాలకు గుట్టపై అటవీ ప్రాంతంలో నిలిచిన బండల మీదుగా కిందకు నీరు వస్తోంది. మంథని చుట్టు పక్కల యువతతోపాటు కొయ్యూరు, కాటారం, భూపాలపల్లి వెళ్లే ప్రయాణికులు జలపాతం వద్ద సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. జలపాతం వద్దకు వెళ్లడానికి సరైన దారి లేక ఇబ్బందులు పడ్డారు.



జలపాతం సందర్శనకు అనుమతి లేదు
మల్లేష్, పెద్దపల్లి రూరల్ ఎస్ఐ



సబ్బితం జలపాతం వద్ద ఇప్పటివరకు సందర్శనకు వచ్చి ఆరుగురు యువకులు మృతిచెందారు. జలపాతం వద్దకు ఎవరికి అనుమతి లేదు. సందర్శకులు, పర్యాటకులు సహకరించాలి. అలాంటి సంఘటనలు జరగకుండా సందర్శనను నిలిపివేశాం.

200 ఏళ్లనాటి జలపాతం
నూనె రాజయ్య, సబ్బితం గ్రామస్థుడు



నిజాం కాలంలో నవాబ్‌లు జలపాతం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. గట్టుసింగారం, సబ్బితం గ్రామ ప్రజలు యేటా నిర్వహించే ఉత్సవాలకు వెళ్తారు. అక్కడ ఉన్న దేవుళ్లకు మొక్కితే కోరిన కోర్కెలు నెరవేరుతాయి.

తునికాకు కోసం గుట్టకు వెళ్లేవాళ్లం
ఆకుల మల్లమ్మ, సబ్బితం గ్రామస్థురాలు



చిన్నప్పుడు తునికాకు కోసం గుట్టకు వెళ్లేవాళ్లం. జలపాతం నీటితో దాహం తీర్చుకునేవాళ్లం. గతంలో జలపాతం వద్ద పెద్ద జాతర కొనసాగేది. గుట్ట మీద పంట పొలాలు సాగు చేస్తే కూలీకి వెళ్లాం. ప్రస్తుతం మా తాతల భూమి అక్కడే ఉంది.

కిసాన్‌నగర్‌లో కార్డన్‌సెర్చ్
71 వాహనాలు స్వాధీనం



స్థానికులతో మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, జూలై 28(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆధ్వర్యంలో త్రీ టౌన్ పరిధిలోని కిసాన్‌నగర్‌లో సోమవారం ఉదయం పోలీసులు కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. పలు అంశాలపై తనిఖీలు చేపట్టారు. పాత నేరస్థులు ఎవరైనా అద్దెకు ఇల్లు తీసుకొని నివసిస్తున్నారా? అనే కోణంలో ఆరాతీశారు. సరైన ధ్రువపత్రాలు లేని 71 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో 64 ద్విచక్రవాహనాలు, ఐదు ఆటోలు, ఒక ట్రాలీ ఆటో, ఒక కారు ఉన్నాయి. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు జరుగుతున్న తీరును వివరించారు. సైబర్ నేరానికి గురైతే గంట లోపల టోల్‌ఫ్రీ నంబరు 1930కి ఫోన్ చేయాలని, సొమ్మును ఫ్రీజ్ చేసి తిరిగి పొందవచ్చని తెలిపారు. మత్తు పదార్థాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై స్థానికులకు అవగాహన కల్పించారు.

అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు : సీపీ

చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం హెచ్చరించారు. కార్డన్ సెర్చ్ అనంతరం స్థానికులతో మాట్లాడారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గించే వ్యక్తులపై సమాచారం అందించాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై సమాచారం ఉంటే డయల్ 100కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్డన్‌సెర్చ్ ఆపరేషన్ ద్వారా కిసాన్‌నగర్‌లో శాంతి భద్రతలను పటిష్టం చేయడంతోపాటు ప్రజల్లో నేరాలపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. ఆపరేషన్‌లో టౌన్ ఏసీపీ వెంకటస్వామి, సీఐలు బిల్ల కోటేశ్వర్, కె.సృజన్‌రెడ్డి, జాన్‌రెడ్డి, పి.శ్రీలత, ఎస్సైలు పాల్గొన్నారు.

సరస్వతీ పుత్రుడికి ఆర్థిక చేయూత...
ఎమ్మెల్యే కవ్వంపల్లి పిలుపుతో విరాళాల వెల్లువ

కరీంనగర్ అర్బన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం గంగిపల్లి గ్రామానికి చెందిన మార మహేశ్ జేఈఈ మెయిన్స్‌లో జాతీయ స్థాయిలో 453వ ర్యాంకు, ఎస్సీ విభాగంలో 17వ ర్యాంకు సాధించి, తిరుచిరాపల్లి నిట్‌లో సీటు పొందాడు. అతడి చదువుకు పేదరికం అడ్డుగా నిలిచింది. అతడి ఐదేళ్ల చదువుకు ఎనిమిది లక్షల రూపాయల ఫీజు, మరో 15 వేలు రిజిస్ట్రేషన్ కోసం అవసరం.. మహేశ్ తండ్రి వ్యవసాయ కూలీ. రెక్కాడితే కాని డొక్కాడని కుటుంబం. లక్షల రూపాయలు వెచ్చించి మహేశ్‌ను చదివించలేని పరిస్థితి. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేక, రాజీ పడి వేరే కోర్సు చేయలేక మహేశ్ తల్లడిల్లాడు. ఈ విషయం కాంగ్రెస్ కార్యకర్తల ద్వారా మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు తెలిసింది. ఆయన మహేశ్ చదువుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మానకొండూర్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఇతరులు 3.22 లక్షల రూపాయల విరాళాలు పోగు చేశారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో సోమవారం ఎల్ఎండీ కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ విద్యార్థి మహేశ్‌కు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివిన మహేశ్ నిట్‌లో జాతీయ ర్యాంకు సాధించడం గొప్ప విషయమన్నారు. చదువులో రాణించే మహేశ్‌లాంటి నిరుపేద విద్యార్థులను ఆర్థికంగా ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మహేశ్‌కు ఆర్థిక సహాయం అందించాలని పిలుపు ఇవ్వగానే కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉన్నతాధికారులు ముందుకు రావడం సంతోషకరమన్నారు. మహేశ్‌కు విరాళాలు ఇచ్చిన వారందరిని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమం అనంతరం మహేశ్‌ను వెంటబెట్టుకుని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, ఆర్డీవో మహేశ్వర్ వద్దకు తీసుకువెళ్లి పరిచయం చేశారు. అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ సదరు విద్యార్థికి వ్యక్తిగత సాయం అందించారు.



మహేశ్‌కు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ

మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు చెల్లించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్నభోజన కార్మికులకు రావాల్సిన పెండింగ్ వేతనాలను చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, సీఐటీయూ మధ్యాహ్న భోజనరంగం జిల్లా కార్యదర్శి గుర జాల శ్రీధర్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ ఎదుట సోమవారం సీఐటీయూ మధాహ్న భోజన రంగం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తరలివచ్చిన కార్మికులుతో ధర్నాచేసి కలెక్టరేట్ ఏవోరాంరెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. పెండింగ్‌లో ఉన్న ఐదునెలల వేతనాలను ఇప్పించాలని వేడుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం బిల్లుల నిర్వహణ ఈకుబేర్ నుంచి మినహాయించాలన్నారు. జిల్లావ్యాప్తంగా అవసరమైన గ్యాస్‌సిలిండర్‌లను ప్రతి పాఠశాలకు ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి కార్మికురాలికి రూ. 10వేల వేతనం అమలు చేయాలన్నారు. మధ్యాహ్నభోజన పథకం ప్రైవేటీకరణను నిలిపివేయాలన్నారు. నగదు బదిలీ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాల న్నారు. కార్యక్రమంలో మధ్యాహ్నభోజన కార్మికులు బలమణి, మ్యాకల కవిత, గడప సంధ్య, మెరుగు బాబాయ్, రెడ్డిమల్ల లక్ష్మీ, కర్మె సంధ్య పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి 'మహా' వరద
ప్రాజెక్టులోకి 75,648 క్యూసెక్కుల నీరు రాక

జగిత్యాల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి సోమవారం వరద నీరు రావడం భారీగా పెరిగింది. డ్యామ్‌లోకి రాత్రి 12 గంటల వరకు 75,648 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తోడు మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడం, విష్ణుపురి నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో గోదావరి నీరు ప్రాజెక్టులోకి వస్తోంది. మహారాష్ట్ర ప్రాంతం నుంచి సుమారు 50 వేలు క్యూసెక్కుల పైచిలుకు నీరు డ్యామ్‌లోకి వచ్చి చేరుతున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఈనెల 27వ తేదీ మధ్యాహ్నం నుంచి ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీల సామర్థ్యానికి గాను ప్రస్తుతం 31.366 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ అవసరాలకు, ఇతరాలకు కలిపి ప్రాజెక్టు నుం చి 638 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఒక్క రోజు వ్యవధిలోనే ప్రాజెక్టులోకి 9 టీఎంసీల నీరు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

సీజన్‌లో తొలిసారి 65 వేలకు పైగా క్యూసెక్కులు దాటి..

ప్రస్తుత సంవత్సరం వానాకాలం సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావొస్తున్నా ఇప్పటి వరకు గరిష్ఠంగా 9వేల క్యూసెక్కుల లోపు ఇన్‌ఫ్లో మాత్రమే వచ్చింది. ప్రస్తుత సీజన్‌లో 65 వేలకు పైగా క్యూసెక్కులు దాటడం ఇదే తొలిసారి. వారం రోజుల పాటు ఇన్‌ఫ్లో ఇదేవిధంగా కొనసాగితే ప్రాజెక్టు నిండుకుండలా మారుతుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

వేములవాడలో శ్రావణ సందడి
రాజన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు





వేములవాడలో భక్తుల రద్దీ, జగిత్యాల జిల్లా మల్లాపూర్‌లోని సోమేశ్వరాలయంలో భక్తుల పూజలు

వేములవాడ కల్చరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం మొదటి సోమవారం సందర్భంగా వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి ఆలయం భక్తులతో పోటెత్తింది. ఉదయాన్నే భక్తులు ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ధర్మ దర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకోగా రాజన్నకు ఎంతో ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు గంటల తరబడి కోడెమొక్కు క్యూలైన్‌లో నిరీక్షించి మొక్కులు చెల్లించుకున్నారు. పరివారం దేవాతాలయాల్లో ప్రత్యేక పూజలో పాల్గొన్న భక్తులు స్వామి వారి కల్యాణ పూజకు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు ఇబ్బందులు తలేత్తకుం డా ఆలయ ఈవో రాధాబాయి ఆధ్వర్యంలో ఏఈవోలు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, శ్రావణ్, అశోక్ ఆధ్వర్యంలో సూపరిండెంట్‌లు ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ క్యూలైన్‌లు ముందుకు సాగేలా చర్యలు చేపట్టారు. వేములవాడ శ్రీరాజరాజేశ్వర నిత్యాన్నదాన సత్రానికి నిజామాబాద్ పట్టణానికి చెందిన మమత- రాజేందర్ దంపతులు రూ. ఒక లక్ష విరాళం అందజేశారు. తమ కూతురు రష్మిక పేరుతో ఆలయ నిత్యాన్నదాన సత్రానికి చెక్కును ఆలయ ఏఈవో శ్రావణ్ కుమార్‌కు అందజేశారు.

ఘనంగా మహాలింగార్చన

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రావణ మాసం మొదటి సోమవారం సందర్భంగా ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 5.30 గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేపట్టారు. సా యంత్రం 6.05 గంటల నుంచి ఆలయ కల్యాణ మంటపంలో మహా లింగార్చన వేద మంత్రోచ్చరణల మధ్య ఘనంగా నిర్వహించారు.

ధర్మపురిలో ప్రత్యేక పూజలు

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలో సోమవారం శ్రావణ సందడి నెలకొంది. లక్ష్మీ నరసింహస్వామి, అనుబంధ శ్రీ రామలింగేశ్వర, క్షేత్ర సమీపంలో గల అక్కపెల్లి రాజరాజేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంక టాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు జక్కు రవీందర్ పాల్గొన్నారు.

సోమేశ్వరాలయంలో..

మల్లాపూర్: మండల కేంద్రంలోని సోమేశ్వరాలయంలోని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. శివలింగానికి పంచా మృతాలతో అభిషేకాలు చేసి శివుడికి బిల్వపత్రిని సమర్పించి ప్రత్యేక పూజలు జరిపారు.

కోటిలింగాలలో..

వెల్గటూర్: కోటిలింగాలలో భక్తులు పార్వతీ కోటేశ్వర స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు నాగరాజుశర్మ, సంజీవ్ శర్మ, అన్వేష్ శర్మలు భక్తులచే పూజలు చేయించి ఆశీర్వచనాలు అందజేశారు.



కల్యాణ పూజకు హాజరైన భక్తులు

నేడు పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం ప్రారంభం
ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించనున్న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్



తంగళ్లపల్లి, జులై 28 (ఆంధ్రజ్యోతి):సిరిసిల్లలో జాతీయ స్థాయి విద్యా సంస్థ పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం నూతన భవనాన్ని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆన్‌లైన్ ద్వారా మంగళవారం ప్రారంభించనున్నారు. ప్రస్తుత రవాణా శాఖ మంత్రి, అప్పటి ఎంపీ పొన్నం ప్రభాకర్ చొరవతో 2013 కేంద్రీయ విద్యాలయం కోసం కృషి చేయగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సిరిసిల్లలో 2015లో మంజూరైంది. అప్పటి నుంచి సిరిసిల్లలో ఇరుకు గదుల్లో కొనసాగుతుండగా తంగళ్లపల్లి మండలం పద్మనగర్ శివారులో కేంద్రీయ విద్యాలయం కోసం స్వంత భవనాన్ని నిర్మించారు. ఈ భవనాన్ని కేంద్ర విద్యా శాఖ మంత్రి మంగళవారం ఉదయం 9 గంటలకు ఆన్‌లైన్ ద్వారా ప్రారంభిస్తున్నారు. కార్యక్రమంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్. కేంద్ర స్వతంత్ర ఇన్‌చార్జి మంత్రి జయంత్ చౌదరి పాల్గొననున్నారు.

ప్లాస్టిక్ బ్యాగుల వాడకం తగ్గేనా?
హోటళ్లు, దుకాణాల్లో యథేచ్ఛగా వినియోగం



జమ్మికుంట రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ బ్యాగ్‌ల నిషేధం అమలు ప్రశ్నార్థకంగా మారుతోంది. ఒకవైపు ప్రభుత్వ అధికారులు తరుచూ ప్లాస్టిక్ నిషేధం అమలుపై పర్యవేక్షిస్తున్నా పరిస్థితుల్లో ఏమాత్రం మార్పు రావడం లేదు. దుకాణదారుల వద్ద దొరికిన ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు జరిమానాలు సైతం విధించారు. ఈ క్రమంలోనే దుకాణదారులకి ప్లాస్టిక్ కవర్లు వాడవద్దని, పేపర్ బ్యాగ్‌లు, జ్యూట్ బ్యాగ్‌లు వాడాలని సూచించారు. ఇది ఎక్కడా ఆచరణలో సాధ్యం కావడం లేదు. గతంలో షాపుల ఎదుట పెట్టి అమ్మకాలు జరిపే దుకాణాదారులు ప్రస్తుతం చాటుమాటుగా కౌంటర్ల లోపల పెట్టి ఇస్తున్నారు. పర్యావరణానికి ప్రమాదకరంగా మారిన 40 మైక్రాన్ల ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను నిషేధించినా అమలుకు నోచుకోవడం లేదు.

ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను వాడొద్దు..

ప్లాస్టిక్ కవర్లలో వేడి ఆహారపదార్థాలను తీసుకెళ్లడం వల్ల ఆ కవర్లలో ఉండే భారలోహాలు కరిగి ఆహారంలో చేరి విషపూరితంగా మారుతాయి. ముఖ్యంగా టిఫిన్ సెంటర్ల నిర్వాహకులు పార్శిళ్లు తీసుకెళ్లేవారికి వేడి వేడి ఆహార పదార్థాలను కవర్లలో ప్యాక్ చేసి ఇస్తుంటారు. ఇలాంటి ఆహార పదార్థాలతో తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ముఖ్యంగా వేడి సాంబారును, వేడి టీని కవర్లలో తీసుకెళ్లడం చేయకూడదు. కొన్ని సందర్భాల్లో కవర్లలో ఇంటికి తీసుకెళ్లిన ఆహార పదార్థాలు తిన్న తర్వాత ఆ కవర్లను చెత్త కుండిలో వేస్తుంటారు. వాటిని మూగజీవాలు వాటిని తిని మృత్యువాత పడుతున్నాయి.

పర్యావరణానికి తీవ్ర హాని..

వేల సంవత్సరాల వరకు మట్టిలో కలవని గుణం కారణంగా ఇవి భూమి పైపొరల్లో పేరుకుపోయి వర్షం పడినపుడు నీటిని భూమిలో ఇంకకుండా అడ్డుకుంటాయి. దీనివల్ల భూగర్భ జలశాతం కూడా తగ్గిపోతుందని పర్యావరణ నిపుణులు పేర్కొంటున్నారు. కాలువల్లో పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల ముంపు ఏర్పడుతోంది. అంతేకాకుండా వీటిని కాల్చినపుడు విష వాయువులు పెద్దఎత్తున గాలిలోకి వెలువడుతున్నాయి. కాబట్టి వీలైనంత వరకు ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను నిషేధించేందుకు అందరూ నడుం బిగించాల్సిన అవసరం ఉంది.

కడుపు 'కోత'లే

(5వ పేజీ తరువాయి)

ఆపరేషన్లు చేస్తూ సొమ్ము చేసుకుంటు న్నారనే విమర్శలు ఉన్నాయి.

సామాన్యులకు కాన్పు భారం

జిల్లాలో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు కాన్పు అనగానే హడలిపోతున్నారు. ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్తే సిజేరియన్ల పేరుతో భారీగా ఫీజు చెల్లించుకోవాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో రూ.50నుంచి లక్షవరకు ఖర్చు అవుతుందని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలు ఉన్నా నిర్లక్ష్య ధోరణి ఆరోపణలతోనే ప్రైవేటు ఆస్పత్రి వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రత్యేక ప్యాకేజీలు కూడా ఇస్తున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు గ్రామీణప్రాంతాల నుంచి ప్రసవాలకు పంపించే వారికి కమీషన్లు అందిస్తూ ప్రైవేట్ ఆస్పత్రులు నిర్వాహకులు అడ్డగోలు వసూలు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

నేడు బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం

ఇల్లంతకుంట, జూలై 28(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని మండలశాఖ అధ్యక్షుడు పల్లె నర్సింహ్మారెడ్డి ఒక ప్రకటనలో కోరారు. జిల్లాకేంద్రంలోని తెలంగాణభవన్‌లో సమావేశం ఉంటుందన్నారు. సమావేశానికి మాజీ మంత్రి కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌లు హజరవుతున్నందున అన్ని గ్రామాల బీఆర్‌ఎస్ నాయకులు సమావేశానికి హజరుకావాలని కోరారు.

వాయిద్య కళాకారుడికి సత్కారం

ఇల్లంతకుంట, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన వాయిద్య కళాకారుడు సలీంను జాతీయ నాయకుడు డాక్టర్ చెన్నారావు, రమణాచారిలు సత్కరించారు. హైద్రాబాద్‌లో జరిగిన మంగళంపల్లి మురళీకృష్ణ జయంతి ఉత్సవాల సందర్భంగా వాయిద్య కళాకారుల జిల్లా అధ్యక్షుడుగా కొనసాగుతుండటంపై అభినందించారు. రాష్ట్రప్రధాన కార్యదర్శి ఎలుక దేవయ్య, జిల్లా ప్రధానకార్యదర్శి పెద్ద దేవయ్య, కోశాధికారి మైలారం శంకర్‌లతో మండలనాయకులు సలీంకు అభినందనలు తెలిపారు.

యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలి

ఇల్లంతకుంట, జూలై 28(ఆంధ్రజ్యోతి): యువతకు స్వయంఉపాధి అవకాశాలు కల్పించాలని బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు నాగసముద్రాల సంతోష్ ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో కోరారు. నిరుద్యోగం పెరుగుతున్నందున వారికి ఆసక్తి కలిగిన అంశాలపై శిక్షణ ఇవ్వాలన్నారు. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలలో శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నందున మండలంలో ప్రారంభించి, యువకులు అభివృద్ధి చెందడానికి సబ్సిడీపై రుణాలు అందివ్వాలని, అప్పుడే యువకులు పురోగతి చెందుతారని పేర్కొన్నారు..

ఆలయ పునరుద్ధరణ పూజలు

ఎల్లారెడ్డిపేట, జూలై28(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లోని శివకేశవ ఆలయ పునరుద్ధరణ పనుల్లో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితులు రాచర్ల శ్రీనివాసశర్మ, రాచర్ల దత్తుశర్మ, కొండపాక శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో గణపతి, నవగ్రహ పూజ, హోమం, హనుమాన్ విగ్రహ పూజలు జరిపించారు. ఆలయ పనులను పూర్తి చేసి పునః ప్రతిష్ఠాపన ఉత్సవాలను నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట సీహెచ్‌సీ సూపరింటెండెంట్‌గా రఘు

ఎల్లారెడ్డిపేట, జూలై28(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్‌గా డాక్టర్ రఘు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇన్‌చార్జి సూపరిండెంట్‌గా ప్రదీప్ కొనసాగారు. పూర్తి స్థాయి బాధ్యతలు చేపట్టిన రఘును పలువురు వైద్యులు అభినందించారు. కార్యక్రమంలో వైద్యులు అజయ్‌కుమార్, బాబు ఉన్నారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

ఎల్లారెడ్డిపేట, జూలై28(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం పురస్కరించుకుని ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు నారాయణపూర్, రాజన్నపేట, బండలింగంపల్లి, రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, అల్మాస్‌పూర్, తదితర గ్రామాల్లోని శివాలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి పూజ, అభిషేకం, తదితర కార్యక్రమాలను జరిపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సిరిసిల్లలో చండీ హోమం

సిరిసిల్ల టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో సోమవారం ఆర్యవైశ్య సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శ్రీ రుద్ర సహిత నవ చండి పారాయణం, శ్రీ రుద్ర సహిత నవ చండీ హోమం వేద పండితుల సమక్షంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ నెల 20న దేవాలయంలో ప్రారంభమైన ముక్కోటి కుంకుమార్చనలు సోమవారంతో ముగిశాయి. కార్యక్రమంలో దేవాలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు రాచ సాగర్‌గురుస్వామి, సభ్యులు మధు, కోటేశ్వర్, విశ్వనాథం, సురేష్ ఉన్నారు.

282 జీవోను రద్దు చేయాలి

సిరిసిల్ల టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : కార్మికులను శ్రమ దోపిడీకి గురిచేసే జీవో నెంబర్ 282ను ప్రభుత్వాలు వెంటనే రద్దు చేయాలని సోమవారం జిల్లా కేంద్రంలో బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్ మాట్లాడారు. పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని ప్రభుత్వాలు తుంగలో తొక్కి 10 గంటలు పని చేయించాలని 282 జీవోను ప్రభుత్వం తీసుకురావడం సిగ్గుచేటన్నారు. నాయకులు, కార్మికులు కొక్కుల ప్రసాద్, నాంపల్లి కొమరయ్య, జిందం రమేష్, మల్లేశం, బింగి రాజమౌళి, నల్ల లింగం, లావణ్య, సుజాత పాల్గొన్నారు.

బురదమయంగా వీధులు



మల్యాలలో బురదమయంగా మారిన వీధి

చందుర్తి జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామాల్లో రోడ్లు బురదమయంగా మారడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. పల్లెలో పరిశుభ్రత లోపించి పారిశుధ్య సమస్యలు పెరిగిపోయాయి. చెత్తాచెదారం పేరుకుపోయి, అంతర్గత రోడ్లు బురదమయం కావడంతో ప్రజారోగ్యానికి ముప్పువాటిల్లే ప్రమాదం ఉంది. క్షేత్రస్థాయిలో ప్రజాప్రతినిధులు లేకపోవడం, గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించడంతో వారు పూర్తి స్థాయిలో పారిశుధ్యంపై దృష్టి సారించలేకపోతున్నారు. మండలంలోని మల్యాల,చందుర్తి, ఎన్గల్, నర్సింగాపూర్, కిష్టంపేట గ్రామాలతో పాటు జలపతి తండాల్లో చిన్నపాటి వర్షానికే అంతర్గత రోడ్లు మొత్తం బురదమయంగా మారి ప్రజలు నడవలేని పరిస్థితి నెలకొంది.

ఇంటింటికీ జ్వర సర్వే



రాశిగుట్టతండాలో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

వీర్నపల్లి, జూలై28,(ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం భూక్యతండా గ్రామపరిధిలోని రాశిగుట్టతండా, బంజేరు గ్రామాలలో దోమల నివారణకు వైద్యసిబ్బంది ఇంటింటా తిరిగి ఫైరిత్రమ్ స్ప్రే చేయించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. రాశిగుట్టతండా, బంజేరులో జ్వరాలు ఉండటంలో వైద్యసిబ్బంది ఇంటింటి తిరిగి రక్త నమూనాలను సేకరించారు. ఇండ్లల్లో నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జ్వరాలు వస్తే ఆరోగ్యకేంద్రాన్ని సంప్రదించాలని వారు కోరారు. గ్రామాల్లో చెత్తచెదారం లేకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు చేపట్టారు. మురికి కాలువల వెంబడి బ్లీచింగ్ చల్లించి, దోమల స్ప్రే ఫాగింగ్ చేయించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ బాలకృష్ణ, హెల్త్ అసిస్టెంట్ రమేష్, సూపర్వైజర్ బాబు, ఏఎన్ఎం కీర్తి, పంచాయతీ కార్యదర్శులు స్రవంతి, రణధీర్, ఫైరిత్రమ్ స్ప్రేయర్ మోహన్, ఆశావర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్



ప్రజావాణికి తరలివచ్చిన ప్రజలు

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు తమ సమస్యలను ప్రజావాణిలో చెప్పుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు సోమవారం కలెక్టరేట్‌కు తరలిరావడంతో కిటకిటలాడిపోయింది. కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీవో వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో వినోద్‌కుమార్ ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ ప్రజావాణిలో 204 దరఖాస్తులు రాగా ఇందులో రెవెన్యూ శాఖకు69, హౌజింగ్ శాఖకు 48, డీఆర్‌డీవో 28, ఎస్‌డీసీకి 9, సిరిసిల్ల మున్సిపాల్టీకి 8, జిల్లా పంచాయతీ అధికారికి 7, జిల్లా విద్యాశాఖ అధికారికి 6, సెస్‌కు 5, జిల్లా ఉపాధి కల్పన అధికారికి 4, జిల్లా మైనింగ్ శాఖకు 2, జిల్లా వైద్యాధికారికి 2డిసీఎస్‌వోకు 2, జిల్లా సంక్షేమాధికారికి 2, ఎస్‌డీఎస్‌ఎల్ఆర్‌కు 2, చేనేత జౌళీశాఖకు 2, జిల్లా నీటిపారుదల శాఖకు 2, ఎస్పీకి 2 అబ్కారిశాఖకు 1, అటవీశాఖకు 1, వేములవాడ దేవస్థానం ఈవోకు 1, ఎస్సీ కార్పొరేషన్‌కు 1, సీపీవోకు 1 చొప్పున దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన అర్జీలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి త్వరితగితన పరిష్కారం చూపడంతో పాటు అర్జీదారులకు లిఖిత పూర్వకంగా సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ శంకర్, జిల్లా పంచాయతీ అధికారి షర్ఫుద్దీన్‌లతోపాటు అధికారులు పాల్గొన్నారు.

- సిరిసిల్ల మున్సిపాల్ పరిధిలోని 8వవార్డు పెద్దూర్‌లో ప్రభుత్వ భూమిని అక్రమించుకుని ఇంటిని నిర్మించిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ సిరిసిల్ల పట్టణానికి చెందిన మొగిలి రాజు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి విచారణ జరిపించాలని కోరారు.

- ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల తిమ్మాపూర్ గ్రామంలో నీరు పోయేందుకు దసబోంద నుంచి జక్కుల చేరువులోకి పోయే కాలువను గ్రామానికి చెందిన లింగం నాంపెల్లి, ఫీర్ మహ్మద్, బీమారి రాజయ్య, పల్లెనాంపెల్లిలు అక్రమించుకోవడంతో అ నీరు సుమారు 40 ఎకరాలభూముల్లోకి వచ్చి సాగు చేసిన పంటలకు జరుగుతుందని దీనిపై విచారణ జరిపించాలంటూ గ్రామానికి చెందిన 30 మంది రైతులు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

ఇల్లంతకుంట మండలం సిరికొండ గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో 20 కుటుంబాలకు మంజూరైన డబుల్ బెడ్‌రూంలను అప్పుచేసి నిర్మించుకున్నామని ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద చేర్చి డబ్బులు చెల్లించాలంటూ లబ్ధిదారులు కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందించి వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎర్ర రాజు, రడం బాలయ్య, సుంకపాక శ్రీనివాస్, ఎర్ర చంద్రయ్య, ఎర్ర పోచయ్య, దాసరి ప్రసాద్, దాసరి రాజయ్య, తడిసిన రాజులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిని బదిలీ చేయవద్దు

ఇల్లంతకుంట మండలం దాచారం గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ఎండి అంకుషావలీని ఉపాధ్యాయుల సర్దుబాటులో భాగంగా రుద్రంగి మండలంలోని హనుమాన్ తండాకు బదిలీలు చేశారన్నారు. బదిలీని నిలిపివేయాలని పిల్లల తల్లిదండ్రులు మార్కెట్ కమిటీ డైరెక్టర్ నర్సింగం, సురేష్, రమేష్, రాజు, పరంధాములు, యాదగిరి, శ్రీకాంత్‌లు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించి వేడుకున్నారు.

ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

వేములవాడ పట్టణంలో విద్యాశాఖనుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటుచేసిన డ్రోనా పాఠశాలపై జిల్లా విద్యాశాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని జిల్లా కలెక్టర్ స్పందించి అ పాఠశాలను మూసివేయడంతోపాటు విద్యార్థి సంఘాలనుంచి మా పాఠశాలలను కాపాడాలంటూ ట్రస్మా వేములవాడ ప్రాంత అధ్యక్షుడు రవిచందర్‌రావు, ప్రధాన కార్యదర్శి సంతోష్‌లు కలెక్టర్‌ను కోరారు.

కొడుకులు పోషించడం లేదు

- అమ్ముల గౌరయ్య, పెద్దలింగాపూర్



ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామానికి చెందన నాకు ఇద్దరు కొడుకులు ఉన్నారు. వారికి నా ఆస్తిని పంచి ఇచ్చాను. నా భార్య 2010లో చనిపోయింది. నాకు ఉన్న ఇద్దరు కుమార్తెలతో పాటు ఇద్దరు కొడుకులకు వివాహం చేశాను. 78 సంవత్సరాల వృద్ధాప్యంలో ఉన్న నన్ను, నాపోషణను ఎవరూ పట్టించుకోవడం లేదు. కలెక్టర్‌గారు చర్యలు తీసుకోవాలి.

కల్వర్టు నిర్మాణానికి నిధులు

ఎల్లారెడ్డిపేట, జూలై28(ఆంధ్రజ్యోతి): చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం స్వగ్రామమైన ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట గ్రామంలో కల్వర్టు నిర్మాణానికి రూ.12 లక్షల డీఎంఎఫ్‌టీ నిధుల మంజూరుకు కృషి చేశారని రేవంత్ మిత్ర మండలి జిల్లా అధ్యక్షుడు గూడ విజయ్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యపై స్థానికులు ఎమ్మెల్యే సత్యం దృష్టికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. ఆయన జిల్లా ఇన్‌చార్జి మంత్రికి వివరించి కల్వర్టు నిర్మాణానికి నిధులు కేటాయించేందుకు ప్రత్యేక చొరవ చూపారని చెప్పారు.

కేజీబీవీ తనిఖీ

వీర్నపల్లి, జూలై27,(ఆంధ్రజ్యోతి): 'కేజీబీవీలో సమయానికి అందని భోజనం' అనే కథనం సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం కావడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో మండల విద్యాధికారి తుమ్మ శ్రీనివాస్ కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు సమయానికి భోజనం ఎందుకు అందలేదని ఆరా తీశారు. మధ్యాహ్న భోజనంపై పూర్తిస్థాయిలో నాన్ టీచింగ్ సిబ్బందిని విచారించారు. పాఠశాలలోని సమస్యలను ప్రత్యేకాధికారి శకుంతల, భోజన నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.

రేపు ఆత్మీయ సమ్మేళనం

కోనరావుపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మాదిగ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోనరావుపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్ అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలో ఈ నెల 30న జిల్లా కేంద్రంలోని కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే మాదిగ ఆత్మీయ సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బస్సుల పోచయ్య, బొల్లె దేవయ్య, లైదల రాజయ్య, లచ్చయ్య ఉన్నారు.

లక్ష మందితో మున్నూరు కాపు ఎన్నికలు

- డాక్టర్ కొండ దేవయ్య

వేములవాడ టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ కేంద్రంగా త్వరలో లక్ష మంది మున్నూరుకాపు పటేల్ రాష్ట్ర అధ్యక్ష కమిటీ ఎన్నికలు ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహిస్తామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య అన్నారు. పట్టణంలోని మున్నూరుకాపు సత్రంలో సోమవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల వేములవాడలో తనకు వ్యతిరేఖంగా నిర్వహించిన బోనాలకు జిల్లా వ్యాప్తంగా మున్నూరుకాపులు హాజరు కాలేదని అన్నారు. తనపై నమ్మకంతో ఉన్న కాపుకులస్థులకు కృతజ్ఞతలు తెలిపారు. మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో లక్ష మందికి ప్రజాస్వామ్య పద్ధతిలో ఒక హక్కు కల్పించి రాష్ట్ర ఎన్నికలను నిర్వహిస్తామని అన్నారు. మూడు తరాల మున్నూరు కాపు కులము అని సంఘం నుంచి ఆధారాలు చూపించి మున్నూరు కాపులు ఎవరైన రాష్ట్ర అధ్యక్షుడిగా పోటీ చేయవచ్చని తెలిపారు. అంతే కాకుండా మున్నూరు కాపులందరూ ఐక్యంగా ఉండి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి వచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తేవాలన్నారు.

డిగ్రీ అడ్మిషన్లకు చివరి అవకాశం

గంభీరావుపేట, జులై 28 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యా మండలి ద్వారా డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు కల్పించే దోస్త్ చివరి అవకాశంగా మరో షెడ్యూల్ ప్రకటించిందని గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణత కలిగి డిగ్రీలో అడ్మిషన్ తీసుకునే విద్యార్థులకు చివరి అవకాశం కల్పిస్తున్నామని ఈ నెల 31 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని వచ్చే నెల 3న సీట్ల భర్తీ ఉంటుందని 6 వరకు కళాశాలలో రిపోర్టు చేయాలన్నారు. నమోదు ప్రక్రియలో విద్యార్థులకు ఏమైనా సాంకేతిక ఇబ్బందులు కలిగితే కళాశాలకు వచ్చి సహాయక కేంద్రంలో సంప్రదించాలన్నారు. కళాశాల సహాయక కేంద్రంలో దోస్త్ రిజిస్ట్రేషన్ ఉచితంగా చేస్తారని పేర్కొన్నారు.

ప్రజావాణితో సమస్యల పరిష్కారం

చందుర్తి జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణితో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తాసిల్దార్ శ్రీనివాస్ అన్నారు. చందుర్తి తహసీల్దార్ కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు ప్రజావాణికి మొత్తం 2 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఏపిఎం రజిత, ఏపీవో రాజయ్య, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ, ఏఈఓ రమ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాదిగల ఆత్మగౌరవ పోస్టర్ ఆవిష్కరణ

గంభీరావుపేట, జులై 28 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలో సోమవారం మాదిగల ఆత్మగౌరవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సిరిసిల్లలో ఈ నెల 30న జరిగే మాదిగల ఆత్మగౌరవ సమ్మేళనంకు పెద్ద ఎత్తున తరళి రావాలని పిలుపు ఇచ్చారు. మండల కేంద్రంతో పాటు ప్రతి గ్రామం నుండి మాదిగలు ఆత్మగౌరవ సమ్మేళనానికి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. పోస్టర్ ఆవిష్కరించిన వారిలో మాదిగల ఐక్యవేదిక నాయకులు బర్కుటం తిరుపతి, ఇరిగి సందీప్, ఇరిగి పర్శరాములు, ఎర్రోల్ల శ్రీహరి, బండమీది దేవయ్య, శనిగరం శ్రీనివాస్. ప్రవీన్, రాజు, తిరుపతి ఉన్నారు.

నిబంధనల ప్రకారం కోడిగుడ్ల టెండర్లు నమోదు చేయాలి

● అధికారులతో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థలకు అవసరమైన కోడిగుడ్లను సరఫరా చేసేందుకు నిబంధనల ప్రకారం టెండర్‌లను ఆన్‌లైన్‌లో దాఖలు చేసేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కోరారు. సిరిసిల్ల సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా స్థాయి కోడిగుడ్ల సరఫరా నిర్వహణ కమిటీ సభ్యులతో టెండర్‌లపై సమీక్ష నిర్వహించారు. ఒక సంవత్సరం పాటు కోడి గుడ్ల సరఫరా టెండర్ ప్రక్రియపై జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థలకు మధ్యాహ్న భోజన పథకం మినహాయించి ఒక సంవత్సరం పాటు అవసరమైన కోడిగుడ్లు ప్రమాణాల ప్రకారం సరఫరా చేసేందుకు టెండర్ ప్రక్రియమ నిర్వహిస్తున్నామని తెలిపారు. కోడిగుడ్ల సరఫరా టెండర్‌ను దాఖలు చేయాలంటే తెలంగాణలోని కోళ్ల ఫారం గల పౌల్ట్రీ రైతులు మూడు సంవత్సరాల ఓనర్‌షిప్ చూపించి టెండర్‌లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. లీజ్ కోళ్ల ఫారంకు అర్హత లేదని అగ్‌మార్క్ సర్టిఫికేషన్ ఉండాలన్నారు. కోడిగుడ్ల సరఫరా టెండర్ బిడ్ డాక్యుమెంట్ జూలై 29లోపు డౌన్‌లోడ్ చేసుకుని అగస్టు 7వ తేదీన సాయంత్రం 4గంటలలోపు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అగస్టు 8వ తేదీన సాయంత్రం 4గంటలకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో టెండర్ డాక్యుమెంట్ హార్డ్ కాపీలు సమర్పించాలన్నారు. అగస్టు 12న టెక్నికల్ బిడ్, 13న ఫైనల్ బిడ్ ఓపెనింగ్ ఉంటుందన్నారు. టెండర్లు ఆన్‌లైన్‌లో ఈ-టెండరింగ్ ప్లాట్‌ఫాంలో మాత్రమే నమోదు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా బీసీ సంక్షేమాధికారి రాజమానోహార్‌రావు, జిల్లా విద్యాశాఖ అధికారి వినోద్‌కుమార్, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం పాల్గొన్నారు.

కేసీఆర్ కిట్‌పై తప్పుడు ఆరోపణలు మానుకోవాలి



కేసీఆర్ కిట్లు పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

చందుర్తి జూలై 28 (ఆంధ్రజ్యోతి): కేటీఆర్ జన్మదినం సందర్భంగా గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు పంపిణీ చేస్తున్న కేటీఆర్ కిట్లపై ప్రతిపక్ష పార్టీ నాయకులు చేస్తున్న తప్పుడు ఆరోపణలను మానుకోవాలని నియోజకవర్గ బీఆర్‌ఎస్ యువజన విభాగం అధ్యక్షులు ఈర్లపల్లి రాజు అన్నారు. చందుర్తి మండలం మల్యాల గ్రామంలో సోమవారం బాలింతలకు కేటీఆర్ జన్మదినం వేడుకల్లో భాగంగా కేసీఆర్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష నేతలు కేసీఆర్ కిట్ల పంపిణీపై గడువు తీరిన కిట్లు పంపిణీ చేస్తున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నరన్నారు. కెసిఆర్ కిట్ల కాల పరిమితి 2028 వరకు ఉందన్నారు. బాలింతలకు కేసీఆర్ కిట్లను ప్రభుత్వం ఇవ్వకపోగా తప్పుడు ప్రచారం చేయడం సరైనది కాదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మినారాయణ, నాయకులు నగరం శంకర్, గొర్రె నందు, శ్రీపతి శ్రావణ్, పోతరాజు శేఖర్ శ్రీనివాస్, ఎన్నం శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

చందుర్తి, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే రేవంత్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి భీమరాజు కనకరాజు అన్నారు. ప్రభుత్వం డ్వాక్రా మహిళా గ్రూపులకు వడ్డీ రుణాలు మంజూరు చేసినందుకు మహిళా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షురాలు మాజీ సర్పంచ్ భీమరాజ్ కళ్యాణి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ల చిత్రపటాలకు చందుర్తి మండలం రామన్నపేట గ్రామంలో సోమవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మహిళలకు ఎన్నో పథకాలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో చింతం ముత్తయ్య, బుర్ర శ్రీనివాస్, తిపని నర్సయ్య, తిప్పని పెద్ద శంకర్, తిప్పని లింగయ్య , దుమ్మ శంకర్, బొడ్డు శంకర్, భీమరాజ్ శ్రీనివాస్, చేనవేని బాబు, తిప్పని మహేష్ ఉన్నారు.

తెలంగాణను ఆంధ్రాకు తాకట్టుపెడుతున్న ముఖ్యమంత్రి



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య

సిరిసిల్ల టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాబంధులకు సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణను తాకట్టు పెడుతున్నాడని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు దిమ్మతిరిగే ఫలితాలను సాధించి బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్రంలో గులాబీ జెండాను ఎగరవేస్తుందని అన్నారు. రాజకీయ బ్రోకర్ అయిన ఆంధ్ర ఎంపీ సీఎం రమేష్‌ను కేటీఆర్‌పైకి ఉసిగొలిపి రేవంత్‌రెడ్డి రాజకీయ డ్రామాను తెరపైకి తీసుకొచ్చాడని ఆరోపించారు. కంచె గచ్చిబౌలి భూములను కార్పొరేట్, ప్రైవేటు వ్యక్తులకు అన్యాక్రాంతం అవుతుందని కేటీఆర్ చెప్పారన్నారు. టీడీపీ, బీజేపీ పార్టీలో డబ్బులు పెట్టి సీఎం రమేష్ ఎంపీ సీటు కొన్నాడని ఆరోపించారు. రేవం త్‌రెడ్డితో సీఎం రమేష్ కుమ్మక్కై హైదరాబాద్‌లో కాంట్రాక్టులు దక్కించుకోవడం కోసం కేటీఆర్‌పై విమర్శలు చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నెరవేర్చలేక ప్రజల మధ్యకు రావడానికి మొఖం చెల్లక బీఆర్‌ఎస్ పార్టీని, కేటీఆర్‌ను బదనాం చేస్తున్నారని ఆరోపించారు. ఆంధ్ర నాయకులతో ములాఖత్ అయి కుట్రలు చేస్తూ లేనిపోని ఆరోపణలు చేస్తూ కాంగ్రెస్ నాయకులు పబ్బం గడుపుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సీఎం రమేష్ బహిరంగ చర్చకు రావాలని కేటీఆర్ చేసిన సవాలుకు సిద్ధం కావాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయమైన కరెంట్, విత్తనాలు, రైతు బంధు, రైతు బీమా ఇచ్చాక స్థానిక సంస్థల ఎన్నికలకు రావాలన్నారు. ఆదే విధంగా ఆడబిడ్డకు రూ. 25వేలు, వికలాంగులు, వృద్ధులు, వితంతులు, ఒంటిరి మహిళలు, నేతన్న, గీతన్న, బీడీ కార్మికులకు పెన్షన్ పెంచి ఇచ్చాక ఎన్నికలకు రావాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ పట్టణ ఉపాధ్యక్షుడు ఎండీ సత్తార్, నాయకులు గజభీంకార్ రాజన్న, దార్ల సందీప్, న్యాలకొండ రాఘవరెడ్డి, గుండారపు కృష్ణరెడ్డి, సుంకపాక మనోజ్, కంచర్ల రవిగౌడ్ పాల్గొన్నారు.

ఫటాఫట్

ఇల్లంతకుంట : యువత వ్యసనాల బారినపడి జీవితాలను పాడుచేసుకోవద్దని ఎస్సై శ్రీనివాసరావు సూచించారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో సోమవారం మత్తుపదార్థాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. వాహనదారులు సరైన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు. ఏఎస్సై బండారి శ్రీనివాస్, హెడ్‌కానిస్టేబుల్ రమణారెడ్డిలతో పాటు పోలీస్‌సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

- ఇల్లంతకుంట మండలంలోని దాచారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున గతంలో పనిచేసిన ఉపాధ్యాయుడిని తిరిగి కేటాయించాలని కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు తల్లిదండ్రులు తెలిపారు.

గంభీరావుపేట: మండల కేంద్రంలోని రామాలయంలో వద్ద సోమవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానికులకు 150 బిందెలను అందజేశారు. రామాలయంలో ప్రతి శ్రావణ మాసంలో మొదటి సోమవారం జరిగే గోదాదేవి జన్మదినాన్ని పురస్కరించుకుని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ తండ్రి రాజేశ్వర్‌రావు ప్రత్యేక పూజలు చేశారు.

కోనరావుపేట: కామ్రేడ్ దేవులపల్లి వెంకటేశ్వరరావు తరిమెల నాగిరెడ్డిల సంస్మరణ సభను విజయవంతం చేయాలని మరిమడ్ల గ్రామీణ పేదల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట మండలం మరిమడ్లలో ఈ నెల 31న కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కళాభారతి హాల్‌లో జరిగే కామ్రేడ్ దేవరపల్లి వెంకటేశ్వరరావు నాగిరెడ్డిల సంస్మరణ సభపోస్టర్ ఆవిష్కరించారు.

రుద్రంగి: మండల కేంద్రంలోని ఆలయాల్లో శ్రావణమాసం తొలి సోమవారం సందర్భంగా భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. ఉదయం నుంచి రుద్రంగిలోని శ్రీబుగ్గరాజరాజేశ్వర స్వామి, మానాలలోని శ్రీ భవానీశంభులింగేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు క్యూ కట్టారు.

వేములవాడ కల్చరల్: వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయ ఆవరణలోని పీఆర్వో కార్యాలయం వద్ద పార్కింగ్ స్థలంలో పాము కలకలం సృష్టించింది. పాము కనిపించడంతో భక్తులు భయాందోళనకు గురయ్యారు. స్పందించిన ఆలయాధికారులు వెంటనే సిబ్బందితో పామును పట్టుకుని అక్కడి నుంచి తరలించారు.